సాక్షి
అనకాపల్లి
శనివారం : 15 : జూన్ : 2024



కనకమ్మకు క్షీరాభిషేకం
విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.



జనారణ్యంలో కణుజు
అడవి నుంచి దారి తప్పి నేలబావిలో పడిన కణుజును అటవీ శాఖ సిబ్బంది రక్షించారు. సపర్యలు చేసి మళ్లీ అడవిలో విడిచిపెట్టారు.
8లో



ఘనంగా వారంతపు పూజలు
రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాంతపు పూజలు ఘనంగా జరిగాయి.

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

గోపాలపట్నం (విశాఖ): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, ఎంపీ భరత్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు..

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

తుమ్మపాల: ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరేందుకు పట్టుదలతో చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. పట్టణంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాల గాంధీనగర్‌లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభ వేడుకల్లో ఆమె పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు స్కూళ్ల విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరుస్తున్నారని, ఈ విద్యా సంవత్సరంలో కూడా మంచి ఫలితాలు సాధించాలన్నారు. మంచి రుచికరమైన మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు దుస్తులు, బ్యాగ్, షూస్, పుస్తకాలు ప్రభుత్వమే అందిస్తుందన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన



తగరంపూడి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ శాంతిప్రభ

తుమ్మపాల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి శాంతిప్రభ అన్నారు. మండలంలో తగరంపూడి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల ఓపీ వివరాల ప్రకారం వారికి అందిస్తున్న వైద్యసేవలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. ఫార్మసీ, స్టోర్స్, కోల్డ్ చైన్‌రూమ్, ఓటీ రూమ్, వార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది పనితీరు, అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో బి.తిరుపతిరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

22న చదరంగం పోటీలు



పోస్టర్ విడుదల చేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి డీఆర్‌ఎం కప్ చదరంగం పోటీలు రెండు రోజుల పాటు శ్రీనివాస కల్యాణ మండపంలో జరగనున్నాయి. ఈకో రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్, క్రీడాధికారి ప్రవీణ్ భాటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొని చాంపియన్‌షిప్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు.

ఉల్లికిపాటు

- కిలో రూ.50కి చేరిక
- మున్ముందు మరింత పెరిగే అవకాశం
- కూరగాయలదీ అదే దారి
- టమాటా కిలో రూ.80



కొన్నాళ్ల క్రితం అందుబాటులో ఉన్న వీటి రేట్లు

సాక్షి, విశాఖపట్నం, తుమ్మపాల: ఉల్లిపాయలతో పాటు కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఇవి సామాన్యుడికి అందనంత ఎత్తులో విహరిస్తున్నాయి. రోజురోజుకూ వీటి ధరలు పెరుగుతూ కొనాలంటేనే జనం భయపడే పరిస్థితులొచ్చాయి. ఉల్లి, కాయగూరల ధరలు అడ్డూ అదుపు లేకుండా పరుగులు పెడుతుండడంతో మున్ముందు ఇంకెంతగా ఎగబాకుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నెల రోజుల క్రితం వరకు కిలో రూ.20కి మించని ఉల్లి క్రమంగా రూ.25కి చేరుకుంది. అలా పెరుగుతూ ఇప్పుడు అనకాపల్లి రైతు బజారులో రూ.40కి, రిటైల్ మార్కెట్‌లో రూ.50కి చేరింది. ఉల్లిపాయలు అధికంగా కర్నూలు, మహారాష్ట నుంచి వస్తుంటాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో వర్షాభావ పరిస్థితులతో ఉల్లి ఉత్పత్తి ఆశాజనకంగా లేదు. దీంతో అక్కడ వ్యాపారులు నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని చెబుతున్నారు. అలాగే కర్నూలులో ఉల్లి పంట చేతికి రావడానికి మరో రెండు నెలలైనా పడుతుందని అంటున్నారు. అందువల్ల వినియోగానికి సరిపడినంత ఉల్లిపాయలు లభ్యం కాకపోవడంతో వీటి ధర పెరుగుతూ వస్తోంది. ఉల్లి అంటేనే ఉలిక్కిపడే స్థాయికి చేరుకోనుంది. రానున్న రోజుల్లో ఉల్లి రేటు మరింత పెరగవచ్చని, ఆగస్టు వరకు పెరుగుదల కొనసాగవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో రాయితీపై ఉల్లిని సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

కోరలు చాస్తున్న కూరగాయలు

ఇక కూరగాయల ధరలు కోరలు చాస్తున్నాయి. ఇప్పుడు అదుపు తప్పుతున్నాయి. కారుచౌకగా దొరికే దొండకాయలు, బెండకాయలు, వంకాయలు, బరబాటీలు వంటివి కూడా కొండెక్కి కూర్చున్నాయి. అనకాపల్లి రిటైల్ మార్కెట్లో కిలో దొండ రూ.50, బెండ రూ.60, వంకాయలు రూ.40, బీరకాయలు రూ.90, బంగాళాదుంపలు రూ.40, అల్లం రూ.220 చొప్పున విక్రయిస్తున్నారు. రైతు బజార్లలో కిలోపై రూ.5–15 తక్కువగా అమ్ముతున్నారు. అయినప్పటికీ సామాన్య, ప్రజానీకానికి ఈ ధరలు ఎంతో భారంగా పరిణమిస్తున్నాయి. దీంతో ఇన్నాళ్లూ కిలో కొనుగోలు చేసిన వారు అరకిలో, అరకిలో కొనే వారు పావు కిలోకు పరిమితమవుతున్నారు.

తారెత్తిస్తున్న టమాటా..

మరోవైపు టమాటా ధరలు తారెత్తిస్తున్నాయి. నెల క్రితం కిలో రూ.20కి మించని వీటి ధర ప్రస్తుతం రూ.80కి పైనే ఉంది. కూరల్లో రుచి కోసం టమాటాలను విరివిగా వాడుతుంటారు. దీంతో వీటికి అలవాటు పడిన వారు ధర పెరిగినా ఎంతో కొంత కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట ఎక్కువగా రాయలసీమలోని మదనపల్లి, పుంగనూరు, బెంగళూరు శ్రీనివాసపురం ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి తెస్తుంటారు. గతంలో మండుటెండలు, వడగాడ్పులు, ప్రస్తుతం వర్షాల వల్ల అక్కడ టమాటా పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని, దీంతో రేట్లు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పైగా ఈ టమాటాలు అంత నాణ్యంగానూ ఉండడం లేదు. ప్రస్తుత పరిస్థితిని బట్టి రానున్న రోజుల్లో వీటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని టమాటా వ్యాపారి జూరెడ్డి శ్రీనివాసరావు 'సాక్షి'కి చెప్పారు.



అనకాపల్లిలో ధరవరలు

(కిలో రూ.లలో)

కూరగాయల రకం	రైతుబజార్	రిటైల్
ఉల్లిపాయలు	40	50
టమాటా	60	80
బంగాళదుంప	30	40
బీరకాయలు	40	60
బెండకాయలు	40	60
దొండకాయలు	40	50
అల్లం	180	220
కాప్సికమ్	80	100



పోలీస్ ఉద్యోగుల గ్రీవెన్స్



పోలీస్ ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: పోలీస్ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. పోలీస్ ఉద్యోగుల నుంచి సమస్యలపై వినతులను ఆయన స్వీకరించారు. ఎనిమిది మంది ఉద్యోగులు వారి వ్యక్తిగత సమస్యలతోపాటు అనారోగ్యం, ఉద్యోగ అంశాలను ఆయనకు వివరించారు. గ్రీవెన్స్‌లను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ ద్వారా పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపా రు. అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 160 మంది ఎంపిక

కంచరపాలెం (విశాఖ): జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్క్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. సుమారు 13 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 417 ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 228 మంది అభ్యర్థులు హాజరైతే 160 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, ఐటీఐ, అప్రెంటిస్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతన్నకు విత్తన భరోసా



రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేసిన విత్తనాలు

- 22,300 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేసిన అధికారులు
- డి-కృషి యాప్ ద్వారా రిజిస్ట్రేషన్
- అందుబాటులో 11 రకాల వరి వంగడాలు
- అపరాలు, వేరుశనగ, నువ్వులు విత్తనాల్లో 40 శాతం రాయితీ
- అన్ని ఆర్బీకేల్లో నేటి నుంచి పంపిణీకి సిద్ధం

సాక్షి, అనకాపల్లి: ఖరీఫ్ సాగుకు వ్యవసాయ అధికారులు విత్తనాలు సిద్ధం చేశారు. రైతులకు వరి, అపరాలు, వేరుశనగ, నువ్వుల విత్తనాలు సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. శనివారం నుంచి జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు వెల్లడించారు. కావాల్సిన రైతులు డి-కృషి యాప్ ద్వారా గానీ, నేరుగా ఆర్‌బీకేల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. విత్తనాల ధరలు కూడా ప్రకటించారు. మరోవైపు గత ఖరీఫ్ కంటే ఈసారి సాగును పెంచేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో సకాలంలో పంటలు పండాయి. ఈసారి అదే తరహాలో ఖరీఫ్‌లో సాగును మరింత పెంచాలని వ్యవసాయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 84 వేల హెక్టార్లలో సాగు జరిగింది. ఇందులో 60 వేల హెక్టార్లలో వరి పంట, 15 వేల హెక్టార్లలో చెరకు, మిగిలినవి వేరుశనగ, చోళ్లు, గంటెలు, చిరుధాన్య పంటలు వేశారు. అదే తరహాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

అందుబాటులో 11 రకాల వరి వంగడాలు

విత్తనాలను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నారు. వ్యవసాయ అధికారులు గోదాముల్లో విత్తనాలను, ఎరువులను సిద్ధం చేసి ఉంచారు. ఖరీఫ్‌లో రైతులకు అధిక దిగుబడి ఇచ్చే విధంగా 4 కొత్త వరి వంగడాలను ఈ ఏడాది అందుబాటులోకి అధికారులు తీసుకొచ్చారు. వరి విత్తనాల్లో మొత్తం 11 రకాలు ఆర్‌బీకేల్లో సిద్ధం చేశారు. వీటిలో మార్టేరు సాంబ(ఎంటీయూ1224) రకం, మార్టేరు మసూరి (ఎంటీయూ1262) రకం, ఎంటీయూ 1318 రకం, శ్రీధృతి (ఎంటీయూ 1121) రకం వరి విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటితో పాటుగా అపరాలు, వేరుశనగ, నువ్వులు విత్తనాలను 40 శాతం సబ్సిడీతో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్‌బీకేల్లో అపరాలు 91 క్వింటాళ్లు, వేరుశనగ 143 క్వింటాళ్లు, నువ్వులు 11 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు.

విత్తనాల రకాలు.. వాటి ధరలు

వరిలో రకాలు	క్వింటాళ్లు	రాయితీ పోను బస్తా ధర
ఆర్‌జీఎల్ 2537	13,500	రూ.954
బీపీటీ 3291	1,092	రూ.834
బీపీటీ 5204	2,268	రూ.795
ఎంటీయూ 1061	592	రూ.894
ఎంటీయూ 1064	1800	రూ.894
ఎంటీయూ 1121	979	రూ.894
ఎంటీయూ 1224	940	రూ.894
ఎంటీయూ 7029	340	రూ.894
ఎంటీయూ 1318	800	రూ.894
ఎన్‌ఎల్‌ఆర్-34449	17	రూ.915
ఆర్‌ఎన్‌ఆర్ 15048	48	రూ.834

కొత్త వంగడాల ప్రత్యేకతలు

మార్టేరు సాంబ (ఎంటీయూ 1224): ఇది సన్న బియ్యం రకం. ఈ రకం సాంబ మసూరి (బీపీటీ-5204) వంగడానికి ప్రత్యామ్నాయ రకం. ఇది ఖరీఫ్‌కు అనువైంది. ఇది 140 రోజుల కాల పరిమితిలో పంట పూర్తవుతుంది. చేను పడిపోదు. సుడి దోమని తట్టుకుని మంచి దిగుబడిని ఇస్తుంది. గింజ రాల్చే గుణం తక్కువగా ఉంటుంది. రెండు వారాలు నిద్రావస్థ దశలో ఉంటుంది. ఎకరానికి 2.6 టన్నుల (34 బస్తాలు) దిగుబడి ఇస్తుంది.

మార్టేరు మసూరి (ఎంటీయూ 1262): ఈ రకం వంగడం శ్రీకాకుళం సన్నాలు (ఆర్జీఎల్-2537) రకానికి ప్రత్యామ్నాయం. 155 రోజుల కాల పరిమితిలో పంట పూర్తవుతుంది. ఖరీఫ్‌కు అనువైన వంగడం. సుడి దోమని తట్టుకుంటుంది. ఎండు తెగులును తట్టుకుని అధిక దిగుబడి ఇస్తుంది. ఎకరానికి 2.6 నుంచి 2.8 టన్నుల(36 బస్తాలు) దిగుబడి నిస్తుంది.

ఎంటీయూ 1318: ఈ రకం స్వర్ణ (ఎంటీయూ 7029)కు ప్రత్యామ్నాయం. 150 రోజుల కాలపరిమితిలో పంట పండుతోంది. ఖరీఫ్‌కు అనువైన వంగడం. చేను పడిపోదు. అగ్గి తెగులును తట్టుకునే స్వభావం ఉంటుంది. ఇది సన్నబియ్య రకం. ఎకరానికి 3 టన్నులు (40 బస్తాలు) దిగుబడి నిస్తుంది.

శ్రీధృతి (ఎంటీయూ 1121): 125 రోజుల కాల పరిమితి. ఈ రకం నుంచి దోమ, అగ్గి తెగులు తట్టుకుంటుంది. ఎకరాకు 3 టన్నులు (40 బస్తాలు) దిగుబడినిస్తుంది.

ప్రతి రోజూ జాతరే..

బొజ్జన్నకొండ.. ఒకప్పుడు కనుమ రోజున మాత్రమే గుర్తుకొచ్చే సందర్శనీయ స్థలం. ఆ రోజున అక్కడ పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. కానీ ఇప్పుడు ప్రతి రోజూ పండగలా సందర్శకులతో కళకళలాడుతోంది. పర్యాటక కేంద్రంగా దీనిని అభివృద్ధి చేయాలన్న మాజీ ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి పట్టుదల కార్యరూపం దాల్చి కొత్త అందాలను సంతరించుకుంది.



బొజ్జన్నకొండ పరిసరాల్లో ఆడుకుంటున్న చిన్నారులు

- బొజ్జన్నకొండకు సందర్శకుల తాకిడి
- చిన్నారుల సందడితో కళకళ
- టూరిస్టు స్పాట్‌గా తీర్చిదిద్దడంతో పెరిగిన ఆదరణ

తుమ్మపాల: చక్కని రహదారులు.. ఎటు చూసినా పచ్చదనం.. అధునాతన భవనాల నిర్మాణం.. పర్యాటక కేంద్రంగా ఎదిగిన బొజ్జన్నకొండ ఇప్పుడు సందర్శకులకు కనువిందు చేస్తోంది. బౌద్ధ స్థూపాలు, చైత్యాలు, గుహలు, బౌద్ధ వేదశాల, చరిత్రను ప్రతిబింబించే పురాతన శిలలు ఇక్కడి ప్రత్యేకత. దీంతోపాటు లింగాలకొండ బొజ్జన్నకొండను ఆనుకుని ఉండటం మరో విశేషం. గౌతమబుద్ధుడు ఇక్కడ నడయాడినట్లు చరిత్ర చెబుతుంది. ఒకప్పుడు మచ్చుకైనా గుర్తింపులేని బొజ్జన్నకొండ.. మాజీ ఎంపీ బి.వి.సత్యవతి ఎంపీ ల్యాడ్స్ నిధులు వెచ్చించి, రూ.7.5 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యేలా కృషి చేయడంతో కొత్త రూపు సంతరించుకుంటోంది. బొజ్జన్నకొండకు అత్యంత నాణ్యమైన రహదారి నిర్మించారు. అధునాతన సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి అధునాతన భవనాలను నిర్మించేందుకు కృషి చేసింది. ఇప్పుడు శరవేగంగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పురాతన కట్టడాలు శిథిలమవ్వకుండా మరమ్మతులు చేపడుతున్నారు.



బొజ్జన్నకొండపైకి మెట్ల మార్గంలో రాకపోకలు చేస్తున్న బాలలు

పెరిగిన పర్యాటకులు

గత ప్రభుత్వాలు ఈ బౌద్ధ క్షేత్రాన్ని నిర్లక్ష్యం చేశాయి. హైవే నుంచి ఇక్కడకు రావాలంటే పెద్ద గోతులతో ఉన్న రహదారిని దాటుకొని రావాలి. అందుకే పర్యాటకులు బెంబేలెత్తిపోయేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతం పూర్తిగా మారిపోయింది. నూతన జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న బొజ్జన్నకొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అత్యధిక నిధులు వెచ్చించారు. దీంతో పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సాయంత్రం అయ్యేసరికి వందల సంఖ్యలో కొండ వద్దకు తరలివస్తున్నారు. తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి విముక్తి పొందుతూ సేద తీరుతున్నారు. వేసవి సెలవుల్లో చిన్నారులు బొజ్జన్నకొండ వద్దనే ఆటపాటలతో సందడి చేశారు. దీంతో ఇక్కడ చిరు వ్యాపారాలు కూడా జోరందుకున్నాయి. జిల్లా టూరిజం శాఖ మంచినీరు, వాష్ రూమ్ సౌకర్యం కల్పించింది. అనకాపల్లి–చోడవరం రహదారిలో తుమ్మపాల ఏలేరు కాలువ మీదుగా, అనకాపల్లి–సబ్బవరం రహదారి శంకరం ఏలేరు కాలువ మీదుగా కూడా సందర్శకులు రాకపోకలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పరిసర ప్రాంత ప్రజలు వాకింగ్, జాగింగ్, వ్యాయామం కోసం ఇక్కడకు వస్తున్నారు.

ప్రవేశం ఉచితం

అనేక సౌకర్యాలు, చక్కని గ్రీనరీతో తీర్చిదిద్దిన బొజ్జన్నకొండ సందర్శనకు ప్రవేశం ఉచితం. కేవలం ఆధార్ కార్డు చూపించి బొజ్జన్నకొండ పైకి ప్రవేశించవచ్చు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశం కల్పిస్తున్నారు. వందల సంఖ్యలో పెద్దలు, చిన్నారులు వచ్చి ఆటపాటలతో సందడి చేస్తున్నారు.

కుదిపేసిన గాలివాన

- ఈదురు గాలులకు కూలిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



నర్సీపట్నం శారదనగర్ మెయిన్ రోడ్డుపై వర్షం నీరు



నర్సీపట్నంలో కారుపై విరిగి పడిన చెట్టు

నర్సీపట్నం: జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉరుములు, పిడుగులు, మెరుపులతో సుమారు రెండు గంటలకుపైగా వర్షం కురిసింది. నర్సీపట్నంలో ప్రధాన డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. మెయిన్ రోడ్డుపై వర్షం నీరు ఏరులై పారింది. శారదనగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మెయిన్ రోడ్డుపై వర్షం నీరు చెరువులను తలపించింది. ఈదురు గాలులకు యూనియన్ బ్యాంక్ వద్ద చెట్టు విరిగి పడడంతో కారు ధ్వసమైంది. ఉరుములు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం తెరిపించిన తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో యలమంచిలి పట్టణంలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తొలకరి సాగు పనులు చేసుకుంటున్న రైతాంగానికి ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెప్పున్నారు. చోడవరం పరిసరాల్లో సుమారు 20 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తంచేశారు. చోడవరం, వెంకన్నపాలెం, గోవాడ, అంబేరుపురం, గంధవరం , లక్ష్మీపురం, దామునాపల్లి, జుత్తాడ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి 8గంటల వరకూ వర్షం పడింది. రాంబిల్లి, బుచ్చెయ్యపేట మండలాల్లో కూడా వర్షాలు పడ్డాయి.

హోం మంత్రిగా అనిత.. టీడీపీ శ్రేణుల్లో ఆనందం



నక్కపల్లి: పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు రాష్ట్ర మంత్రివర్గంలో కీలకమైన హోంమంత్రిగా అవకాశం లభించడంతో నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లా నుంచి మంత్రులైన నేత లెవరినీ హోంశాఖ వరించలేదు. నియోజకవర్గం ఏర్పడిన ఆరు దశాబ్దాల తర్వాత 'పాయకరావుపేట'కు మంత్రి పదవి దక్కడంతోపాటు ముఖ్యమైన శాఖ రావడం పట్ల సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. మహిళా చట్టాలు మరింత పటిష్టంగా అమలు జరిగేందుకు తన వంతు పాటుపడతానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి హోదాలో తొలిసారిగా శనివారం నియోజకవర్గానికి వస్తున్న అనితకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు.

నిస్సహాయులకు అండగా రెడ్ క్రాస్ సొసైటీ



విజయ రెసిడెన్సీలో రక్తదానం చేస్తున్న యువకులు



జార్జిక్లబ్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ రామ్మూర్తి, జోగినాయుడు

తుమ్మపాల: ప్రమాదాలు జరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిస్సహాయులకు అండగా రెడ్ క్రాస్ సొసైటీ ఉంటుందని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి.రామ్మూర్తి అన్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రి హెల్త్ సర్వీసెస్ కోఆర్డినేషన్ ఆధ్వర్యంలో స్థానిక జార్జ్ క్లబ్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ 1864లో జెనీవాలో జరిగిన 14 దేశాల సమావేశంలో శాస్త్రవేత్త జీన్ హనరీ డ్యూనెట్ ప్రమాదాల బారిన పడిన వారికి ప్రాణదానం చేయడమే ప్రధాన లక్ష్యంగా రెడ్‌క్రాస్ సొసైటీని ప్రారంభించారన్నారు. జార్జ్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు, కార్యదర్శి బుద్ధ కాశి మాట్లాడుతూ ప్రపంచానికి ఏడు విధాలైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రెడ్‌క్రాస్ సంస్థ ప్రారంభమైందన్నారు. జార్జిక్లబ్‌లో ప్రతి ఏటా పలు వైద్యసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా 100 మంది బ్లడ్ గ్రూపు పరీక్షలు చేయించుకుని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షురాలు హిమజ, కోఆర్డినేటర్ ఎన్.కోటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ సంగీత్, డాక్టర్ కనక దుర్గ, దాడి బుజ్జి (వైభవ్), విల్లూరి చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ పీల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

53 మంది రక్తదానం

ప్రతిఒక్కరు రక్తదానం చేయాలని, తద్వారా ఆరోగ్యం పొందడంతో పాటు మరొకరికి ప్రాణ దానం చేసినట్టు అవుతుందని డీఎంహెచ్‌వో బాలాజీ అన్నారు. పట్టణంలో విజయ రెసిడెన్సీలో సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపక చైర్మన్ కోరుబిల్లి పరమేష్ (పరి) ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ శిబిరంలో 53 మంది రక్తదానం చేశారు. వారితో పాటు డీఎంహెచ్‌వోను సర్వేజన ఐక్యవేదిక సభ్యులు సత్కరించి షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ కనక దుర్గ, సభ్యులు ఇంకుల మధు, రాజు, లాలం కన్నజీ, కర్రి మహాలక్ష్మినాయుడు, గొర్లి శేఖర్, రేబాక మధు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ క్రీడాకారులకు డీఎస్పీ అభినందన



స్కేటింగ్‌లో రాణించిన చిన్నారులను అభినందిస్తున్న డీఎస్పీ మోహన్

నర్సీపట్నం: స్కేటింగ్‌లో రాణించిన ఇద్దరు చిన్నారులను డీఎస్పీ మోహన్ శుక్రవారం అభినందించారు. ఈ నెల 10న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ ర్యాంకింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్ స్కేటింగ్ పోటీల్లో స్థానిక అర్జున్ స్కేటింగ్ అసోసియేషన్ నుంచి 20 మంది చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో కె.సాత్విక్, జి.మాన్విత్ పతకాలు సాధించారు. వీరిని డీఎస్పీ మోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్జున్ స్కేటింగ్ చైర్మన్ వెలగా నారాయణరావు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనారణ్యంలో కణుజు



క్రేన్ సాయంతో కణుజును బయటకు తీస్తున్న స్థానికులు



బావిలోంచి బయటకు తీసిన తర్వాత సేద దీరుతున్న కణుజు

- కుక్కల నుంచి తప్పించుకోబోయి బావిలో పడిన వన్యప్రాణి
- క్రేన్ సాయంతో బయటకు తీసి రక్షించిన అటవీ,అగ్నిమాపక అధికారులు
- ప్రథమ చికిత్స అనంతరం పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచిపెట్టిన సిబ్బంది

యలమంచిలి రూరల్: అడవి నుంచి బయటకు వచ్చిన కణుజు కుక్కలబారి నుంచి తప్పించుకోబోయి లోతైన నేల బావిలో పడిపోయింది. సమాచారం తెలుసుకున్న యలమంచిలి అటవీ అధికారులు అక్కడకు చేరుకుని కణితిని రక్షించారు.అటవీ అధికారులు,స్థానికులు తెలియజేసిన వివరాలివి.. యలమంచిలి మండలం ములకలాపల్లి సమీపంలో ఓ కొబ్బరితోటలో ఉన్న లోతైన నేల బావిలో శుక్రవారం ఉదయం భారీ కణుజును స్థానికులు గుర్తించారు.ఈ సమాచారాన్ని యలమంచిలి అటవీ సెక్షన్ అధికారి బి.వి.రమణకు తెలియజేశారు.వెంటనే అక్కడకు చేరుకున్న యలమంచిలి అటవీ రేంజ్ అధికారి జి.అనిల్ కుమార్,బీట్ అధికారి షేక్ మదీనా,యలమంచిలి అటవీ అధికారి రాంబాబు, ఇ.వేణుకుమారి, సిబ్బంది బావిలో పడిన కణుజును రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. సమీపంలో గల మైహోం సిమెంట్ కర్మాగారం నుంచి భారీ క్రేన్‌ను బావి వద్దకు రప్పించారు. నిచ్చెనలతో కొందరు గ్రామస్థులు బావిలోకి దిగి కణుజుకు తాళ్లను కట్టారు.సుమారు 8 నుంచి 9 సంవత్సరాల వయసున్న కణుజు 7 అడుగుల పొడవు,4 అడుగుల ఎత్తు ఉంది.200 కిలోలకు పైగా బరువు ఉండడంతో గంటకు పైగా శ్రమించి నెమ్మదిగా క్రేన్ సాయంతో దానిని బయటకు తీశారు.కొమ్ములు విరిగిపోవడం,స్వల్ప గాయాలబారిన పడడంతో పశువైద్యునితో కణుజుకు ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో విడిచిపెట్టారు. అయితే అటవీ ప్రాంతంలోంచి కణుజు జనావాసాల్లోకి ఎలా వచ్చిందనే దానిపై అటవీ అధికారులు ఆరా తీస్తున్నారు.ఈ ప్రాంతంలో పలువురు వేటగాళ్లు తరచుగా వన్యప్రాణులను వేటాడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.రెండు నెలల క్రితం ఏటికొప్పాకలో కణుజు మాసం విక్రయించిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. వన్యప్రాణులను వేటాడడం కోసం వేటగాళ్లు కుక్కల్ని వాటిపైకి ఉసిగొల్పి చాకచక్యంగా వాటిని హతమార్చి మాంసాన్ని విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. కణుజు మాసం ధర కిలో రూ.800 నుంచి రూ.1100 వరకు పలకడంతో కొందరు వేటగాళ్లు యథేచ్ఛగా వన్యప్రాణులను వేటాడుతూ ధనార్జనకు అలవాటు పడ్డారు.వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని అలాంటి చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల వేట జరగకుండా ములకలాపల్లి ప్రాంతంలో అటవీ అధికారులు గార్డులను కాపలాగా ఉంచారు.

మా రూటే సెపరేటు..!

- 'ప్రైవేటు'లో సొంత పుస్తకాలు
- ఎన్‌సీఈఆర్‌టీ టెక్స్‌బుక్స్ కొనుగోలుకు నిరాసక్తత
- విద్యార్థులకు ఆర్థిక భారమవుతున్న ప్రైవేటు చదువులు
- స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు
- ఫీజులు వసూళ్లపై నియంత్రణ కరువు
- ఉమ్మడి విశాఖలో 1,436 ప్రైవేటు స్కూళ్లు



ఓ ప్రైవేటు స్కూల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

విశాఖ విద్య: ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ద్వారా ముద్రించిన పాఠ్యపుస్తకాలనే వినియోగించాలనే నిబంధనలకు తూట్లు పడుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ప్రైవేటు స్కూళ్లకు ఏటా ఎంపిక చేసిన ఏజెన్సీల ద్వారా పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తుంటారు. ఇందుకోసం పాఠశాల యు-డైస్ కోడ్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతుల వారీగా ఎంతమంది విద్యార్థులు ఉన్నారు..? వారికి కావాల్సిన పాఠ్యపుస్తకాల వివరాలను ఆయా ప్రైవేటు యాజమాన్యాలు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 1,436 ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రక్రియ జోరందుకుంది. విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునే సమయంలోనే ప్రైవేటు యజమాన్యాలు పుస్తకాలు, యూనిఫారాలు వంటి వాటిని తమ వద్దనే కొనాలనే ఒత్తిడి చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

సొంత పుస్తకాలు వీల్లేదు

ప్రైవేటు, కార్పోరేటు స్కూళ్లల్లో తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే బోధన సాగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వ,ప్రైవేటు స్కూళ్లలో ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన ప్రశ్నా పత్రాలతోనే పరీక్షలన్నీ నిర్వహించనున్నారు. అయితే కొన్ని కార్పొరేట్ స్కూళ్లల్లో ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ కాకుండా, తమ సొంత సిలబస్‌తో పుస్తకాలను ముద్రించి, వాటిని విద్యార్థులతో కొనుగోలు చేయిస్తున్నారు. వీటి కోసమని ఎంతలేదన్నా రూ.10 వేలు వరకు చెల్లించాల్సి వస్తోందని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు.

స్కూళ్లలోనే పుస్తకాల వ్యాపారం

పాఠ్యపుస్తకాలను నిర్దేశిత ధరలకే విక్రయించేలా గతేడాది విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. 1వ తరగతి రూ.399లు, రెండో తరగతి రూ.425లు, మూడో తరగతి రూ.675లు, నాల్గో తరగతి రూ.702లు, 5వ తరగతికి రూ.727లు, 6వ తరగతికి రూ.747లు, 7వ తరగతి రూ.871లు, 8వ తరగతి రూ.1,181లు, 9వ తరగతికి రూ.1,167లు, పదో తరగతికి రూ. 859లు గా నిర్ణయించారు. ఈ ఏడాది దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేకపోవటంతో ప్రైవేటు యాజమాన్యాలు స్కూళ్లలోనే పుస్తకాల వ్యాపారానికి తెరలేపారు.

అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు

ప్రైవేటు స్కూళ్లల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులపై విద్యాశాఖ నియంత్రణ లేకపోవటంతో పేద,మధ్య తరగతి వారికి తీవ్రమైన ఆర్థిక భారమవుతోంది. ప్రైవేటు స్కూల్ మోజుతో అడ్మిషన్ల కోసమని వస్తే యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నగరంలో డిమాండ్ ఉన్న కొన్ని స్కూళ్లలో ఒకటో తరగతికి రూ.40 నుంచి 50 వేలు వరకు అదే పదో తరగతికి అయితే రూ.70 వేలు నుంచి రూ.1 లక్ష వరకు కూడా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ఫీజుల వసూలు చేయాలి. అది కూడా ఎంత వసూలు చేయాలనేది పాఠశాల ప్రాంగణాల్లోని బోర్డులపై అందరికీ కనిపించేలా రాయాలి. కానీ విశాఖ నగరంలోని పాఠశాలల్లో ఇవేమీ కనిపించటం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ స్థాయిలో సత్వరమే స్పందించి, అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

సొంత పుస్తకాలు విక్రయిస్తే చర్యలు



ప్రైవేటు స్కూళ్లలోనూ తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే చదువులు సాగాలి. అలా కాకుండా ఎక్కడైనా సొంత పుస్తకాలు ముద్రించి విక్రయించినట్లుగా కానీ, వాటితో బోధన చేస్తున్నట్లు తెలిస్తే అలాంటి పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల వారంతా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల కోసం వెంటనే నివేదికలు సమర్పించాలి. దీనిపై పర్యవేక్షణ చేసేలా డీఈవోలకు ఆదేశాలు ఇచ్చాం.

– బి. విజయ భాస్కర్, రీజినల్ జాయింట్ డైరక్టర్,

పీఎం సూర్యఘర్ పరిమితులు సులభతరం

- మరింత మందికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు
- ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం : ఇంట్లోనే సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం పరిమితులను మరింత సులభతరం చేసిందని ఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ ఎల్ మహేంద్రనాథ్ తెలిపారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో మరింత మందికి లబ్ధి చేకూరేలా అర్హతలను సవరణ చేశారని వివరించారు. గతంలో దరఖాస్తుదారుని వార్షికవేతనం రూ.1.5లక్షలు కంటే తక్కువ ఉండాలనే నిబంధనను ఎత్తివేస్తూ.. ఎవరైనా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కొత్త నిబంధనల మేరకు 10 కిలోవాట్లలోపు లోడ్‌కి డిస్కమ్ అనుమతులేవీ అవసరం లేదని, అదేవిధంగా 10కిలోవాట్ దాటిన వారికి సీఈఐజీ అనుమతి కాకుండా సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని వివరించారు. గతంలో 21 ఏళ్లు నిండిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండేదని, ఇప్పుడు దరఖాస్తుదారుడు రిజిస్టర్డ్ విద్యుత్ వినియోగదారుడైతే చాలని వయసుతో సంబంధం లేదని ఎస్ఈ మహేంద్రనాథ్ స్పష్టం చేశారు. కొత్త నిబంధనలను పరిగణనలోకి తీసుకొని విశాఖ సర్కిల్ పరిధిలో ఉన్న వినియోగదారులంతా సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటిపైనే సౌర విద్యుత్ ఉత్పత్తితో అనేక లాభాలు పొందేలా ప్రయోజనాలుంటాయని ఎస్ఈ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తుమ్మపాల: పట్టణంలోని రింగ్‌రోడ్డు లో గల డాక్టర్ హిమ్ శేఖర్ డిగ్రీ కళాశాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రింగ్‌రోడ్డులో ఒక వ్యక్తి మృతి చెందినట్టు శుక్రవారం అందిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. పూటుగా మద్యం సేవించి మృతి చెందినట్టు తెలిసిందన్నారు. మృతదేహాన్ని స్థానిక జిల్లా ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించామన్నారు. మృతుడు బ్లూ కలర్ షర్టు, ఆఫ్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేట రాజ చెరువు సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో నాగయ్యపేటకు చెందిన వేచలపు త్రినాథ్, అతని భార్య దేవితో పాటు తామరబ్బకు చెందిన మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన కడారి దేముడు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 వాహనంలో కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. తలపై తీవ్ర గాయాలైన భార్యాభర్తలు త్రినాథ్, దేవిలను మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించినట్టు వారి బంధువులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలి మృతి



చిన్నమ్మ మృతదేహం

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ పీనారపాలెంలో విద్యుత్ షాక్‌తో రెడ్డి చిన్నమ్మ(70) అనే వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది. స్నానం చేసేందుకు సిల్వర్ పాత్రలో కరెంట్ హీటర్‌తో నీళ్లు మరగపెట్టేందుకు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

చెన్నై- సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై-సంత్రగచ్చి-చెన్నై మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి(06007) ప్రత్యేక రైలు శుక్రవారం రాత్రి 9 గంటలకు బయలుదేరగా.. శనివారం మధ్యాహ్నం 1.54 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.59 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.15 గంటలకు సంత్రగచ్చి వెళ్తుంది. సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(06007) స్పెషల్ జూన్ 16వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరి.. మధ్యరాత్రి 1.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.50 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 3.50 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

108 ఉద్యోగుల సమావేశం



108 వాహన ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తున్న అధికారులు

అనకాపల్లి (కశింకోట): 108 వాహన ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు సేవలందించాలని జిల్లా మేనేజర్ వి.వి.త్రినాథరావు కోరారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో 108 వాహన ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. 108 వాహన సేవల్లో లోటుపాట్ల గురించి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా ఫ్లీట్ మేనేజర్ జగ్గారావు, అనకాపల్లి డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ నాగేశ్వరరావు, నర్సీపట్నం డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ శామ్యూల్, ఉద్యోగ ప్రతినిధులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సీతారాం, జి.వి.ఎస్.మూర్తి, వి.మూర్తి, జిల్లాలోని 108 వాహనాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కంటి భాగంలో గుచ్చుకున్న కర్ర ముక్క

- విజయవంతంగా తొలగించిన కేజీహెచ్ వైద్యులు



శస్త్ర చికిత్స ద్వారా వైద్యులు తొలగించిన కర్ర ముక్క



యువకుడి కంటికి, మెదడు కింది భాగంలో గుచ్చుకున్న కర్ర ముక్క



పూర్తిగా కోలుకున్న రోగితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 39 ఏళ్ల యువకుడి కంటికి, కనుబొమ్మకు మధ్య భాగంలో గుచ్చుకున్న కర్ర ముక్కను తొలగించి.. తిరిగి కంటి చూపును తీసుకొచ్చారు. ప్రస్తుతం రోగి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. వివరాలివీ.. నర్సీపట్నం మండలం గురధరపాలెం గ్రామానికి చెందిన మీసాల నాగేశ్వరరావు ఈ నెల 4 రాత్రి 9.30 గంటల సమయంలో తన ఇంటి మొదటి అంతస్తు పైనుంచి జారిపడిపోయాడు. ఈ ఘటనలో 12 సెం.మీ సరుగుడు కర్ర ముక్క తన కుడి కంటికి, కనుబొమ్మ మధ్య భాగంలోకి చొచ్చుకుపోయింది. ఈ నెల 5న కేజీహెచ్‌కు తీసుకురాగా.. కంటి, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, మత్తు వైద్యులు సమన్వయంతో ఈ నెల 6న న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్స నిర్వహించారు. అనంతరం సరుగుడు కర్ర ముక్కను తొలగించారు. శస్త్ర చికిత్స అనంతరం రోగికి హయ్యర్ యాంటీబయాటిక్స్ ఇచ్చారు. అనంతరం ఐసీయూలో వైద్య సేవలందించారు. ప్రతీ క్షణం పర్యవేక్షించడంతో రోగి నూరు శాతం కోలుకున్నాడు. శస్త్ర చికిత్స సమయంలో కన్ను, కంటి నరాలు, మెదడు కింద ఉన్న రక్తనాళాలు, నరాలు జాగ్రత్తగా వేరు చేసి ఆ సరుగుడు కర్ర ముక్కను తొలగించారు. ఆ తర్వాత మళ్లీ పరీక్షలు నిర్వహించారు. దీంతో కంటి చూపు కూడా తిరిగి వచ్చింది. న్యూరో సర్జరీ డాక్టర్ హయగ్రీవరావు, మత్తు వైద్యులు డాక్టర్ రవి, డాక్టర్ శ్రీ లక్ష్మి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ కల్యాణి, డాక్టర్ దక్షిణామూర్తి, ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ మురళీకృష్ణ, స్టాఫ్‌నర్స్ సత్యవతి, సిబ్బంది సమష్టిగా పని చేయడం వల్ల రోగి పూర్తిగా కోలుకున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

క్లుప్తంగా

మండుతున్న సూరీడు



ఎండ వేడితో జనం లేక వెలవెలబోయిన కశింకోటలో ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజలు సూర్య తాపంతో శుక్రవారం విలవిలలాడారు. గత కొద్ది రోజులుగా చల్లగా ఉన్న వాతావరణం మళ్లీ ఒక్కసారిగా భానుని ప్రతాపంతో వేడెక్కింది. ఉదయం 11 గంటల నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు బయటకు రాలేక, ఎక్కువ శాతం మంది ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం కాస్త చల్లబడటంతో ప్రజలు తమ సాధారణ పనుల్లో నిమగ్నమయ్యారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట: మండలంలోని తేగాడ వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.మార్తాతిలకం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. వీటికి ఈ నెల 20లోగా ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

రోలుగుంట: కొండలపాలెంలోని శ్రీకృష్ణ భగవాన్ ఆలయ 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యుడు గంగారాజు, రోలుగుంట పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కర్రి వీరునాయుడు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

గ్రామాల్లో ఇంటింటా ధర్మ ప్రచారం

అచ్యుతాపురం: మండలంలోని తంతడి, గండివానిపాలెం గ్రామాల్లో శుక్రవారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ యలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ ఇంట్లోనే కులం అని, బయట మనమంతా హిందూవులమే అంటూ వ్యాఖ్యానించారు. తోటి వారిని ఆదరించాలని, గౌరవించాలని సూచించారు. సత్యం, వెంకటరావు, గండి రాజు, చెల్లిబోయిన దేవుడు, గంగమ్మ, ధనలక్ష్మి, లోక్‌నాథ్ అప్పారావు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
యేవమ్	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 232 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,200
రెండో రకం	4,000	4,150
మూడో రకం	3,810	3,910

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 355 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (0892 4223595)ని సంప్రదించవచ్చు.

పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

వర్షా కాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా పశువులకు ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమే. అయినా పాడి రైతులు అప్రమత్తం కాకపోతే చిన్న చిన్న వ్యాధులే తీవ్ర ప్రభావం చూపుతాయి. పెంపకందార్లు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా జీవి ప్రాణానికే ప్రమాదం వాటిల్లవచ్చు. అందేకే పశువైద్యులు పాడిరైతులకు ముందస్తుగానే హెచ్చరిస్తున్నారు.

- పశువులకు వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం
- ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా జంతువు ప్రాణానికే ప్రమాదం
- అత్యవసర సమయంలో 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దే వైద్య సేవలు







పశువుకు చికిత్స చేస్తున్న సంచార పశు ఆరోగ్య సేవా సిబ్బంది

యలమంచిలి రూరల్: వర్షాకాలంలో పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీపంలోని పశువైద్యశాలలను సంప్రదించాల్సిందిగా సూచిస్తున్నారు. ఒకవేళ జీవం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, ఆస్పత్రికి తరలించలేని పరిస్థితి ఉన్నా 1962 నంబరుకు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో పశు వైద్యులు వచ్చి అందిస్తున్నారు. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశు వైద్యశాలకు తరలిస్తారు.

గాలికుంటుతో పశువుల్లో నీరసం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువుకు 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

పీడించే 'జలగ'

మురుగునీరు, కాల్వల్లో అశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మి.లీ. నీయోజడ ప్లస్‌ను అందించాలి.

నట్టలతో ఎదుగుదలకు బ్రేక్

గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా నులి పురుగులే తినేయడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చి మేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలుగా ఆరు నెలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది.

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొతువాపు వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో(హెచ్ఎస్) టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

వ్యాక్సిన్‌తో 'చిటుకు'లో చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు. ఈ వ్యాధి వచ్చినపుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూన్, జూలై మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందిస్తే వాటిని వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చు.

సకాలంలో చికిత్స చేయించాలి



పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్ చేస్తే సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందిస్తారు. సాధ్యమైనంతవరకు జీవాల ప్రాణాలను నిలబెట్టేందుకు వైద్యులు శ్రమిస్తారు. ఎలాంటి సందేహాలున్నా రైతులు పశు వైద్య కేంద్రాల్లో పశు వైద్యులను సంప్రదించవచ్చు.

– డాక్టర్ బి.సౌజన్య, ఏడీ, పశు సంవర్ధక శాఖ, అనకాపల్లి

జాతీయ యోగ దినోత్సవ అవగాహన ర్యాలీ రేపు



యోగా శిబిరంలో ప్రాణాయామం చేస్తున్న దొరమ్మనాయుడు

తుమ్మపాల: ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఒకటే సరైన మార్గమని, శ్వాసపై ధ్యాస సంబంధిత ప్రాణాయామాలతో ఎన్నో రోగాలకు స్వస్తి పలకవచ్చని పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. పట్టణంలోని జార్జ్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 21న జరపనున్న జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవంలో భాగంగా భారీ స్థాయిలో మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నందు యోగాసనాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు వివిధ ప్రాంతాల నుంచి యోగాభ్యాసకులు భారీ సంఖ్యలో రానున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యోగా నేర్పేందుకు శిక్షణ పొందిన యోగా ట్రినర్స్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అవసరమైన యాజమాన్యాల వారు 9848521738 నంబర్లో తమను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో జార్జ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి బీఎస్ఎంకే జోగినాయడు, బుద్ధ కాశీ విశ్వనాథ్, సభ్యులు వి.చంద్రశేఖర్, జి.మంగయ్య, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యం

తుమ్మపాల: ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం వల్ల భూమికి మంచి పోషకాలు అందుతాయని, పంటల దిగుబడికి రసాయన ఎరువులు వాడనవసరం లేదని ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శిరసపల్లి అప్పలరాజు అన్నారు. మండలంలోని వెంకుపాలెం గ్రామంలో రైతులతో కలిసి శుక్రవారం వెయ్యి కిలోల ఘన జీవామృతం తయారు చేశారు. ఇది ఆరు నెలల పాటు నిల్వ ఉంటుందని, దమ్ములో పైభాగంగా దీన్ని వాడుకోవచ్చన్నారు. పకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యం, బెల్లం, పత్తి వంటి ఉత్పత్తులను ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మార్కెటింగ్ స్టాల్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రసాయన కూరగాయల కన్నా ఆర్గానిక్ ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు. మార్కెట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులను పది శాతం ఎక్కువ రేటుతో రైతులు అమ్ముకోవచ్చన్నారు. ఈ రకమైన వ్యవసాయ ఉత్పత్తులతో రైతులు లాభాలతోపాటు, ప్రజలకు ఆరోగ్యకర జీవనం సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆర్గానిక్ సాగు రైతులు మజ్జి సత్యారావు, మువ్వల అప్పారావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనితకు హోంమంత్రి పదవిపై సంబరాలు



హోంమంత్రిగా అనితకు పదవి లభించడంతో కేక్ కట్ చేస్తున్న కూటమి శ్రేణులు

కశింకోట: రాష్ట్ర హోం మంత్రిగా వంగలపూడి అనితకు బాధ్యతలు అప్పగించడం పట్ల కశింకోటలోని పార్టీ కార్యాలయం వద్ద ఎన్డీయే కూటమి శ్రేణులు శుక్రవారం రాత్రి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు దాసరి బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కశింకోట బాలికల హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాస రచన పోటీలు



పాఠశాల ఆవరణలో మొక్కలను పరిరక్షిస్తున్న విద్యార్థులు

కశింకోట: పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని స్థానిక బాలికల హైస్కూల్ హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి సూచించారు. కశింకోటలోని బాలికల హైస్కూల్లో శుక్రవారం ఎకో సంస్థ తరఫున పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య నివారణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టారు. పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయులు డి.కాళిదాస్, పద్మ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఐ ద్వారా వినియోగదారుల హక్కుల పరిరక్షణ



లయన్స్ క్లబ్ తరఫున పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న కాండ్రేగుల వెంకటరమణ

కశింకోట: ఆర్టీఐ చట్టంతో వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవచ్చని ఆర్టీఐ రిసోర్స్‌పర్సన్ కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. అనకాపల్లిలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చేబోలు రామ్మూర్తి మెమోరియల్ లయన్స్ సర్వీస్ సెంటర్ హాలులో ఆర్టీఐ చట్టం-వినియోగంపై జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రశ్నించిన తత్వం పెరిగే కొద్దీ ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం మెరుగు పడుతుందన్నారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించే హక్కు ప్రతి పౌరునికి ఉందన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థికి క్లబ్ తరపున ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరాజు, కార్యదర్శి బి.అప్పలరాజు, సభ్యులు దారా జగన్నాథరావు, ఎస్.ఎస్.ప్రకాష్‌గుప్త, పూసర్ల సుధీర్, బి.పద్మరాజు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థి కుసుమను అభినందిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

పరవాడ: మండలంలోని రావాడ శివారు ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కోన కుసుమ అనే విద్యార్థిని నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వి.సన్యాసి చెప్పారు. కుసుమకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. పాఠశాలలో చదువుతున్న మిగిలిన విద్యార్థులు కూడా స్కాలర్‌షిప్ పొందే విధంగా కృషి చేయాలని గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు కోరారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన కుసుమను సర్పంచ్ సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థి ప్రసన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహారంతో ఆరోగ్య సంరక్షణ



తాళ్లపాలెంలోని గురుకుల పాఠశాలలో ఆరోగ్య సూచనలిస్తున్న ఆరోగ్య బోధకుడు ప్రసాద్

కశింకోట: విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండటానికి పోషకాహారం తీసుకోవాలని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ సూచించారు. తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. సురక్షితమైన నీటిని తాగాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తాయని, దోమలు కుట్టకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.గ్రేస్, ఆరోగ్య బోధకులు ఎంఎస్‌వీ ప్రసాద్‌లు విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. చేతుల ద్వారానే ఎక్కువగా రోగాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వైఏ సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కేజీ నరసింహారావు, ఏఎన్ఎం అన్నమ్మ, ఆరోగ్య కార్యకర్త ఆర్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, అధికారులు

పరవాడ: మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వాడచీపురుపల్లిలో శుక్రవారం గ్రామ సచివాలయ ఉద్యోగులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ శివలంక లక్ష్మి మాట్లాడుతూ మలేరియా రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మలేరియా వ్యాధి, నివారణ పై అందరు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా పై అవగాహన కల్పిస్తూ వాడచీపురుపల్లి వీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, వైస్ సర్పంచ్ కూండ్రపు శ్రీను, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శాస్త్ర విద్య సమాజ అభివృద్ధికి ఆధారం

- ఆర్జేడీ విజయభాస్కర్



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనది.. జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు శాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధనను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. కొత్తగా ఆలోచించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్స్ ఎస్.బాబూరావు, జి.చంద్రమౌళి, సీహెచ్.రాధాకృష్ణ, పి.రవిప్రసాద్, ఎంవి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో శ్రీవిద్య ప్రారంభిక కోర్సు ప్రారంభం



శ్రీవిద్య కోర్సు నేర్చుకునేందుకు వచ్చిన విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శ్రీవిద్య ప్రారంభిక కోర్సును శక్రవారం ప్రారంభించారు.తెలుగు భాషా మాధ్యమంగా ఈ నెల 14 నుంచి 17 వరకూ నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న ఈ కోర్సును గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు. చెన్నై,కోయంబత్తూర్,ఆగ్రా,కోల్‌కతా, బెంగళూర్,రాయపూర్,ఢిల్లీతో పాటు యూరప్‌లోని లాత్వియా నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు ముందుగా గురు పాదుకా మంత్రోపదేశం చేసి కోర్స్‌ను ప్రారంభించారు. శ్రీగణపతి,బాల,చండీ మంత్రోపదేశాలు చేశారు. నాలుగు రోజుల్లో వీరు మంత్ర సాధన,యంత్రపూజ,తర్పణాల థియరీతో పాటు ఆచరణపూర్వకంగా ఉపాసనా విధానాలను నేర్చుకుంటారన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ తమ అనుగ్రహ భాష్యంలో అనేక మంది ప్రాంతీయతతో సంబంధం లేకుండా అమ్మవారి ఉపాసన నేర్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కందర్ప ప్రభాకర్‌తో పాటు ఆచార్యులు మూర్తి రాధ,కందర్ప రమ,వి. షణ్ముఖేశ్వరన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం

మునగపాక: మండలంలోని గణపర్తిలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు వీరాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాలాజీనగర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

ఎకో క్లబ్ కార్యక్రమంలో పాఠశాల పరిశుభ్రం



హైస్కూల్లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

కోటవురట్ల: బడిని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులు నడుం బిగించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శుక్రవారం పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేసే పని చేపట్టారు. హెచ్ఎం మడ్డు లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు పిచ్చిమొక్కలు తొలగించి, చెత్తను ఏరివేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 13 నుంచి 16 వరకు పాఠశాలలో ఎకో క్లబ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, రత్నం, కల్యాణం, కృష్ణ, బాబు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారులు ఎస్. లక్ష్మణరావు,బీఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా పుస్తకాలు అందజేశారు. ఎంఈవో లక్ష్మణరావు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్స్ కిట్స్ 54 పాఠశాలలకు గాను 40 పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.బాలురకు యూనిఫాం రావాల్సి ఉందని చెప్పారు.జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. తిరుపతిరావుతో పాటు పాఠశాల బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.